# ఉపాధ్యాయుల మరియు విద్యారంగ సమస్యలను గౌ॥ ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చి పరిష్కరించేందుకుగాను APTF చేపట్టిన "పోస్టుకార్డు" ఉద్యమాన్ని విజయవంతం చేయండి !

## రాష్ట్ర ఉపాధ్యాయ లోకానికి APTF పిలుపు !!

మిత్రులారా !

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అధికారం లోనికిరాకముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలతోబాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు, విద్యార్థులకు – అధికారంలోనికి వస్తే అమలు చేసేందుకు – అనేక హామీలిచ్చారు. ఆ హామీల్లో తక్షణం తీర్చగలిగినవి ఉన్నవి, కొంత సమయం తీసుకుని అమలు చేయగలిగినవి ఉన్నాయి. అయితే ఈ సమస్యలలో చాలా భాగం గత ప్రభుత్వం నుండే అపరిష్కృతంగా ఉండిపోయాయి. ఈ సమస్యల పరిష్కారం కొరకు ఈ కాలమంతా ఉద్యోగులు, ఉపాధ్యాయులు "సమ్మె" తో సహ వివిధ రూపాలలో ఆందోళనలు చేస్తూనే వచ్చారన్నది స్పష్టం! కానీ పరిష్కారం కాకపోవడం అటుంచి ప్రతి సమస్య అంతకుముందు కంటే జటిలం అవుతూవచ్చిందన్నది కూడా స్పష్టమే!

"ప్రభుత్వం నియమించిన పే రివిజన్ కమీషన్ సిఫారసులు ఇచ్చిన వెంటనే యథాతథంగా అమలు చేస్తాం" అని తెలుగు దేశంపార్టీ ఎన్నికల ప్రణాళికలో స్పష్టంగా పేర్కొనటం జరిగింది. పే రివిజన్ కమిషన్ సిఫారసులతో కూడిన నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అంది 4 నెలలు అవుతుంది. కాని దాని అమలుకు ఇంతకాలం చర్యలేమీ తీసుకోక పోగా అస్సలు నివేదికనే ప్రభుత్వ 'వెబ్‌సైట్' లో ఉంచకుండా రహస్య నివేదికగానే నేటికీ పరిగణించడం జరుగుతున్నది. శాసన సభకు సమర్పించిన బడ్జెట్‌లో కూడా నివేదిక అమలు చేస్తే కావలసిన నిధుల కేటాయింపు లేకపోగా – అసలు పి.ఆర్.సి. అమలు ప్రస్తావనే లేకపోవడం గమనార్హం. ఈ లోగా ధరలు ఎవరి అదుపు లేకుండా పెరిగిపోతుండటం వలన ఉద్యోగ వర్గాల నిజవేతనాలు పడిపోతున్నాయి. ఉద్యోగ వర్గాలకు నగదు రహిత వైద్యం కోసం హెల్త్ కార్డులను జారీ చేస్తామని కూడా ఎన్నికల ప్రణాళికలో పేర్కొనటం జరిగింది. ఈ అంశం పై గత ప్రభుతం నుండి ఇప్పటి వరకు వివిధ స్థాయిలలో '27 సమావేశాలు' జరిగినా సమస్య ఒక కొలిక్కి వచ్చినట్లు కనపడటం లేదు. హామీ అమలుకు మాత్రం తేదీలు మారిపోతున్నాయి. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 సం॥రాల నుండి 60 సం॥రాలకు పెంచినప్పటికీ ఇంకా ఎయిడెడ్ ఉపాధ్యాయుల విషయంలో అమలు కాలేదు. పదవీ విరమణ వయస్సును పెంచేందుకు ప్రభుత్వం ప్రకటించినందున గత జూన్ 30 నుండి పదవీ విరమణ చేసిన ఎయిడెడ్ సిబ్బందికి అటు పింఛనూ లేక ఇటు జీతమూ లేక – ఉభయభ్రష్టత్వం!

ఇక విద్యారంగానికొస్తే 'పాఠశాల విద్య' తీవ్ర నిరాదరణకు గురి అవుతున్నది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అవుతున్నా ప్రభుత్వ స్థాయిలో గాని, ఉన్నతాధికారుల స్థాయిలో గాని పాఠశాల విద్య గురించిన 'పూర్తిస్థాయి సమీక్ష' లేదు. 'శ్వేతపత్రం' విడుదల చేసినా అందులో గత ప్రభుత్వ నిర్వాకం గురించిన ప్రస్తావనే కాని – అనంతర చర్యలు మాత్రం శూన్యం. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న విధంగా పాఠశాలల ఏర్పాటు మాట దేవుడెరుగు – రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల 'మూసివేత' కు, తరగతుల 'రద్దు' కు ఉన్నతాధికారులు చర్యలను ముమ్మరం చేస్తున్నారు. 'ఉమ్మడి సర్వీస్ రూల్స్' సమస్య 10 సం॥రాలకు పైగా పరిష్కారం కాకపోవటంతో క్షేత్ర స్థాయిలో విద్యాశాఖాధికారులు లేక పర్యవేక్షణ తీవ్రంగా దెబ్బతింటున్నది. ఉపాధ్యాయుల బదిలీలకు కౌన్సెలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రస్తుత ముఖ్యమంత్రి హయాంలోనే ఆ విధానానికి తూట్లుపొడిచే విధంగా ప్రభుత్వ స్థాయిలోనే నేరుగా బదిలీలు చేసేందుకు రంగం సిద్ధమైంది. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ ఫైలు గత 4 సంవత్సరాలుగా విముక్తికి నోచుకోలేదు – కాగా ప్రభుత్వ స్థాయిలోనే మోక్షం లేక మూలుగు తున్నది. స్వాతంత్ర్యం వచ్చి 67 సం॥రాలు దాటినా ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ఇంకా "గ్రాంట్–ఇన్–ఎయిడ్" తిప్పలు తప్పటం లేదు. గత 10 సంవత్సరాల నుండి ఎయిడెడ్ పాఠశాలల్లో నియామకాలు లేక వందలాది పాఠాశాలలు మూత పడుతుండగా – ఉపాధ్యాయులు ప్రమోషన్లు లేక నష్టపోతున్నారు.

ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాఠాశాల విద్యారంగము, ఉపాధ్యాయులె దుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలను గౌ॥ ముఖ్యమంత్రి దృష్టికి, గౌ॥ మానవ వనరుల శాఖామంత్రి దృష్టికి ఏ.పి.టి.ఎఫ్ పక్షాన తీసుకెళ్ళడం జరిగింది. అయినా పరిష్కారం కాని పరిస్థితులలో అతిముఖ్యమైన సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి గారి దృష్టికి మరోసారి "పోస్టుకార్డు ఉద్యమం" ద్వారా తీసుకు వెళ్ళాలని సెప్టెంబర్ 29వ తేదీన నెల్లూరు జిల్లా పెంచలకోనలో జరిగిన ఏ.పి.టి.ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సుదీర్ఘ చర్చల అనంతరం నిర్ణయించింది. ఏ.పి.టి.ఎఫ్ చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని, తద్వారా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని రాష్ట్ర ఉపాధ్యాయలోకానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

**ఉద్యమాభి వందనాలతో**


**ఎ. సదాశివరావు**
అధ్యక్షులు – ఏ.పి.టి.ఎఫ్
సెల్ : 9440152332

**జి. హృదయరాజు**
ప్రధాన కార్యదర్శి – ఏ.పి.టి.ఎఫ్
సెల్ : 9059860603


## సమస్యలు

1. గౌరవ ముఖ్యమంత్రి హామీమేరకు పి.ఆర్.సి నివేదికను 1-7-2013 నుండి అమలుచేయాలి. అంతకుముందు చర్యగా నివేదికను 'ప్రభుత్వ వెబ్‌సైట్' లో ఉంచాలి.
2. ఉద్యోగులకు, అన్ని యాజమాన్యాలలోని ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు వర్తించే విధంగా హెల్త్‌కార్డులను తక్షణం జారీ చేయాలి.
3. ప్రభుత్వ, పంచాయితీరాజ్ ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూపొందించి – యం.ఇ.ఓ, డి.వై.ఈ.ఓ, జూనియర్ లెక్చరర్లు మరియు డైట్ లెక్చరర్ల పోస్టులను భర్తీచేయాలి.
4. పిల్లల మనోవిజ్ఞాన శాస్త్రానికనుగుణంగా పాఠశాలల పనివేళలను యథాపూర్వ స్థితిలో కొనసాగించాలి.
5. ఉపాధ్యాయుల బదిలీలను కౌన్సెలింగ్ విధానంలోనే జరపాలి. ప్రభుత్వ స్థాయి బదిలీలను తక్షణం నిలిపివేయాలి.
6. రూ.398/-ల ప్రత్యేక వేతనం పై పని చేసిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
7. ఉన్నత పాఠశాలలోని భాషాపండితులు, పి.ఇ.టి.ల పోస్టులను స్కూలు అసిస్టెంట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలి.
8. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు సగంవేతన సెలవును నగదుగా మార్చుకునే సౌకర్యాన్ని పునరుద్ధరించాలి.
9. మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ విడుదల చేయాలి.
10. 37/2005 మరియు 1/2005 చట్టాలను రద్దుచేసి – ఎయిడెడ్ ఉపాధ్యాయులు, భాషాపండితులు పొందిన ప్రయోజనాలను పునరుద్ధరించాలి.
11. గౌరవముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఎయిడెడ్ ఉపాధ్యాయుల పదవీవిరమణ వయస్సును 60 సం॥రాలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయాలి.
12. ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకానికి, ప్రమోషన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.
13. నూతన రాష్ట్ర ప్రభుత్వం – ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న విధంగా విద్యారంగ, ఉపాధ్యాయుల, ఉద్యోగులకు సంబంధించిన హామీలను అమలు చేయాలి.
14. ఏ.పి.టి.ఎఫ్ పక్షాన గౌ॥ ముఖ్యమంత్రి, విద్యామంత్రి గార్లకు చేసిన ప్రాతినిధ్యాలలోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి.

**– ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏ.పి.టి.ఎఫ్)**
**రి.నెం. 1938**


**ఉపాధ్యాయ ఉద్యమ మాస పత్రిక "ఉపాధ్యాయ ప్రగతి"**
**చదవండి! చదివించండి!! సంవత్సర చందా 100/-లు**